నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
13 | హైదరాబాద్, మంగళవారం 27 ఫిబ్రవరి 2024 | RANGAREDDY



కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

# 5 నెలలుగా జీతాల్లేవ్.. బతికేదెట్లా..?

రంగారెడ్డి, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : బకాయి వేతనాలను చెల్లించాలంటూ సోమవారం రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట తెలంగాణ పంచాయతీ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని 558 గ్రామ పంచాయతీల్లో 6,030 మంది గ్రామ పంచాయతీ సిబ్బంది పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి లైట్లు, కారోబార్, బిల్ కలెక్టర్లుగా పని చేస్తున్న వారికి నాలుగైదు నెలల వేతనాలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నదన్నారు. వేతనాలు రాక అప్పులు చేసి బతకాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా అనంతనం అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు, ఎన్.రాజు, పి.సుధాకర్, అలువాల రవి కుమార్, ఎ.శేఖర్, గోపాల్, నర్సింహ, రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు

## ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ అనిత, అసిస్టెంట్ కమిషనర్ శేఖర్

కడ్తాల్, ఫిబ్రవరి 26 : ఆలయ భూములు అన్యాక్రాంతం, ఆక్రమణలకు గురికాకుండా పటిష్టమైన పరిరక్షణ చర్యలు చేపడుతున్నట్లు దేవాదాయ శాఖ భూముల పరిరక్షణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ అనిత, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ తెలిపారు. చెన్నకేశవ స్వామి ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు సోమవారం తహసీల్దార్ గిరిధర్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఈవో మోహన్‌రావులతో కలిసి వారు అన్మాస్‌పల్లి గ్రామానికి వెళ్లి గ్రామస్తులు, నాయకులతో మాట్లాడారు. ఆలయ భూములను ఎవరికీ వదిలేదిలేదని తేల్చి చెప్పడంతోపాటు నిలిపివేసిన కంచె ఏర్పాటు పనులను పూర్తి చేసి భూమిలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. అనంతరం పోచమ్మగడ్డతండా సమీపంలో ఆక్రమణకు గురైన చెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించిన సర్వే నంబర్ 120లోని భూమిని పరిశీలించారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 76లోని 6.05 ఎకరాల భూమిని పరిశీలించారు. వారంలోగా ఇక్కడ సర్వే చేపట్టి హద్దులు ఏర్పాటు చేయడంతోపాటు కంచె, హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆలయ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆంజనేయులు, సభ్యులు శాయిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, యాదయ్య గౌడ్, ఎగిరిశెట్టి బాబు, దేవాదాయ శాఖ సీనియర్ అసిస్టెంట్లు కృష్ణగౌడ్, బోడియానాయక్, జూనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు రామచందర్‌నాయక్, శేఖర్, సురేశ్, అనిల్‌యాదవ్, జగన్, కేశవులు, పర్వతాలు, కృష్ణయ్య, శ్రీనివాస్, మల్లేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

**మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించిన సర్వే నంబర్ 130లోని భూములకు ఇటీవలే దేవాదాయ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. ఆలయ భూమిలో అక్రమంగా వేసిన రోడ్డును తొలగించి కంచె ఏర్పాటు చేస్తున్నారు. దీనిపై రెండు రోజుల క్రితం అన్మాస్‌పల్లి, శాయిరెడ్డిగూడెం గ్రామాల నాయకులు అభ్యంతరం వ్యక్తం చేసి పనులను నిలిపివేయించారు. రోడ్డు మూసివేస్తే తమ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతామని, కొంత రహదారిని వదలాలని కోరుతూ పనులను అడ్డుకున్న విషయం తెలిసిందే.**



లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ భూములకు కంచె ఏర్పాటు చేయిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

# నేడు మన్నెగూడకు కేటీఆర్ రాక

## వేద కన్వెన్షన్‌లో బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం



ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 26 : బీఆర్ఎస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. ఉదయం 10గంటలకు మన్నెగూడ సమీపంలోని వేద కన్వెన్షన్‌లో నిర్వహించే సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారన్నారు. పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ స్థలంలోని నిర్మాణాలు

# ఆగని అక్రమ నిర్మాణాలు

**వికారాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గృహకల్ప పక్కన గల ప్రభుత్వ స్థలంలో అక్రమ ఇండ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. రాత్రికి రాత్రే సంబంధిత ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు మాత్రం చోద్యం చూస్తుండడం గమనార్హం. 'నమస్తే తెలంగాణ' కథనంతో ప్రభుత్వ భూమి కబ్జా విషయం వెలుగులోకి వచ్చింది. వికారాబాద్ మండల రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టిన ఒకరిద్దరికి నోటీసులిచ్చి చేతులు దులుపుకొన్నారు. ఆక్రమణదారులకు నోటీసులిచ్చి నెల రోజులు దాటినా వారి నుంచి ఎలాంటి సమాధానం రాకపోయినా రెవెన్యూ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. మరోవైపు సంబంధిత ప్రభుత్వ స్థలంలో అక్రమాలను అడ్డుకోకపోవడంతో నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.**

- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు
- మున్సిపల్ అధికారులు అనుమతులిస్తున్నారంటూ తప్పించుకుంటున్న రెవెన్యూ యంత్రాంగం
- వికారాబాద్ మండలం ఆలంపల్లి పరిధిలోని మూడున్నర ఎకరాల్లో రాత్రికి రాత్రే వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు
- సర్వే నంబర్ 290, 291, 292లో దర్జాగా అక్రమ నిర్మాణాలు
- పది కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నా.. పట్టనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు

వికారాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలోని ఆలంపల్లి సర్వే నంబర్ 290, 291, 292లలో 27 ఎకరాల 25 గుంటల ప్రభుత్వ భూమి ఉన్నది. సంబంధిత భూమి నుంచి 4 ఎకరాలు డబుల్ బెడ్‌రూం ఇండ్లకు కేటాయించగా మిగతా 23 ఎకరాల 25 గుంటల ప్రభుత్వ భూమి ఉన్నది. సంబంధిత ప్రభుత్వ భూమిలో దాదాపు మూడున్నర ఎకరాల వరకు కబ్జాకు పాల్పడి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. దాని విలువ మార్కెట్‌లో రూ.10 కోట్ల వరకు ఉంటుంది. 2009లో ఇదే ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇండ్ల నిర్మాణం చేపట్టారని అప్పటి వికారాబాద్ సబ్ కలెక్టర్‌లు దాదాపు 56 మందిపై కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు అప్పట్లో హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ దృష్టి సారించి సంబంధిత అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని, అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రభుత్వ స్థలంలో మున్సిపల్ అనుమతులు..**

జిల్లా కేంద్రంలోని ఆలంపల్లి సర్వే నంబర్ 290, 291, 292లోని ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిన అధికారులు మరో శాఖపై ఆరోపణలు చేస్తూ పరోక్షంగా అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న ఇండ్లకు సంబంధించి వికారాబాద్ మున్సిపల్ అధికారులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాలకు అనుమతులను మున్సిపల్ అధికారులే ఇస్తున్నారని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. బోగస్ పట్టాలు సృష్టించి ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలిసింది. అసలు కబ్జాదారుల వద్ద ఉన్న పట్టాలు నిజమైనవా లేదనే విషయమై మున్సిపల్ అధికారులు ఎలాంటి విచారణ చేయకపోవడం గమనార్హం. ఇదే అదునుగా మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణదారుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేస్తూ, అక్రమ నిర్మాణాలకు అనుమతులతో పాటు ఇంటి నంబర్‌ను కేటాయిస్తున్నట్లు తెలిసింది. ఇదే విషయమై ఓ మున్సిపల్ అధికారిని 'నమస్తే తెలంగాణ ప్రతినిధి' వివరణ తీసుకోగా, ఎక్కడ నిర్మాణాలు చేపట్టినా మేం ఇంటి నంబర్ జారీ చేస్తామని చెప్పడం గమనార్హం. మరోవైపు అక్రమ నిర్మాణదారులకు నోటీసులిచ్చి నెలరోజులు దాటినా వారి వద్ద ఉన్న పట్టాలు రెవెన్యూ అధికారులకు అందజేయకపోయినప్పటికీ అక్రమ నిర్మాణాలను చూసిచూడనట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**25 ఇండ్లకు నోటీసులిచ్చాం..**

అక్రమ నిర్మాణాలను చేపట్టిన వారిలో 25 ఇండ్లకు సంబంధించి నోటీసులు జారీ చేశాం. పట్టాలున్నాయని చెప్పారు, పట్టాలు తీసుకురావాలని మరో పది రోజులు అవకాశమిచ్చాం. అక్రమ నిర్మాణాలకు అనుమతులు జారీ చేస్తున్న మున్సిపల్ అధికారులపై కేసులు నమోదు చేయాలి... కానీ, మరో శాఖపై చర్యలు తీసుకోలేం. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయడంలో వెనుకడుగు వేసేదేం లేదు,

– లక్ష్మీనారాయణ, వికారాబాద్ తహసీల్దార్

# అధికారులంతా సమన్వయంతో పని చేయండి

## చేవెళ్లలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ శశాంక



చేవెళ్లలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

షాబాద్, ఫిబ్రవరి 26 : చేవెళ్లలో మంగళవారం జరిగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యక్రమంలో జిల్లా అధికారులంతా సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ శశాంక సూచించారు. ముఖ్యమంత్రి చేవెళ్ల పర్యటన సందర్భంగా సోమవారం కలెక్టర్ చేవెళ్ల ఫరా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం 4గంటలకు ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో చేవెళ్ల పట్టణానికి చేరుకుని హెలిప్యాడ్ నుంచి నేరుగా ఫరా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చేరుకుని, ఆరు గ్యారంటీల అమలులో భాగంగా 200 యూనిట్లు వరకు ఉచిత కరెంట్, రూ.500 గ్యాస్ సిలిండర్ ప్రారంభించే కార్యక్రమాలను పూర్తి చేసుకుని తిరిగి వెళ్లే దాకా ఎవరెవరికి అప్పగించిన బాధ్యతలను వాళ్లు సమర్థవంతంగా నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడా చిన్న పొరపాటు జరుగకుండా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలన్నారు. అవసరమైతే సోమవారం రాత్రి వరకు స్టాల్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని డీఆర్‌డీఏ అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కలెక్టర్ శశాంక హెలిప్యాడ్, స్టేజీ, పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఆర్డీవో సాయిరాం, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డిప్యూటీ సీఈవో రంగారావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పబ్లిక్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్, ఫిబ్రవరి 26 : హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట, రామంతాపూర్‌లలో 1వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ శశాంక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ కులాల బాలబాలికల నుంచి 2024–25 విద్యా సంవత్సరానికిగాను దరఖాస్తు ఫారాలు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఉచితంగా పొందవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను 12–03–2024 రోజున మధ్యాహ్నం 3గంటల్లోపు అందజేయాలన్నారు. ఆ తర్వాత ఇచ్చిన దరఖాస్తులు అంగీకరింపబడవన్నారు. అర్హులైన దరఖాస్తుదారులకు 15–03–2024 రోజున సాయంత్రం 4గంటలకు కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో లాటరీ పద్ధతి ద్వారా ఇద్దరు విద్యార్థులను బేగంపేట స్కూల్ నందు ప్రవేశం కోసం, ఒక విద్యార్థిని రామంతాపూర్ పబ్లిక్ స్కూల్ నందు ప్రవేశం కోసం ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల లోపు ఉండాలన్నారు. రంగారెడ్డి జిల్లా వాసులై ఉండాలని, కులం, ఆదాయం, స్థానిక ధ్రువీకరణ పత్రాలు మీ సేవ నుంచి పొంది ఉండాలని చెప్పారు. తేదీ 01–06–2017 నుంచి 31–05–2018 వరకు పుట్టిన వారు అర్హులన్నారు. పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం(మీ సేవ)మున్సిపల్/తహసీల్దార్ కార్యాలయం నుంచి పొంది ఉండాలన్నారు. జిరాక్స్ ధ్రువీకరణ పత్రాలను గెజిటెడ్ అధికారిచే ధ్రువీకరణ చేయించాలన్నారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు(ఎన్ రోల్‌మెంట్ ఐడీ నంబర్, యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ ఐ.ఐ.డి, యు.ఐ.డి)ను దరఖాస్తుకు జత చేయాలని తెలిపారు. అన్ని ధ్రువీకరణ పత్రాలను మూడు సెట్‌లు జిరాక్స్ తీసి దరఖాస్తు ఫారానికి జత చేయాలన్నారు.

6 పాస్ పోర్టు సైజు ఫొటోలు జత చేయాలన్నారు. ఒక కుటుంబం నుంచి ఇద్దరు పిల్లలు మాత్రమే అర్హులని చెప్పారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా దరఖాస్తు చేసుకొన్న బాలబాలికలు మాత్రమే స్కాలర్ షిప్‌కు అర్హులన్నారు. దరఖాస్తు ఫారం సమర్పించినప్పుడు అన్ని ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో చూపించాలన్నారు. ఏదేని ఇతర సమాచారం అవసరమైతే జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయం, కొంగర్‌కలాన్, రంగారెడ్డిజిల్లా కలెక్టర్ కార్యాలయం నందు సంప్రదించాలన్నారు. లేదా సంబంధిత సహాయ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చేవెళ్ల, ఇబ్రహీంపట్నం వారికి సంప్రదించవచ్చని సూచించారు.

# పట్టు బిగిస్తున్న బీఆర్ఎస్..

- జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలకు బీఆర్ఎస్ సభ్యులు దూరం
- జడ్పీ చైర్‌పర్సన్‌తోపాటు మరో ముగ్గురు కాంగ్రెస్ సభ్యులు మాత్రమే హాజరు
- స్టాండింగ్ కమిటీ సమావేశాలకు వెళ్లని 14 మంది బీఆర్ఎస్ జడ్పీటీసీలు
- కేవలం రెండు కమిటీలతోనే ముగింపు

వికారాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీలో చేరిన జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటించిన బీఆర్ఎస్ జడ్పీటీసీలు జడ్పీ పీఠాన్ని దక్కించుకునేలా పట్టు బిగిస్తున్నారు. ఇప్పటికే నిర్ణీత సమయంలోగా బలపరీక్ష నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన బీఆర్ఎస్ జడ్పీటీసీలు అవిశ్వాసం ప్రవేశపెడితే నెగ్గేలా పక్కా వ్యూహంతో ముందుకెళ్తున్నారు. ఇందులో భాగంగా జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలకు బీఆర్ఎస్ జడ్పీటీసీలు అందరూ దూరంగా ఉండి ఐక్యతను చూపించారు. జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలకు కేవలం నలుగురు సభ్యులు మాత్రమే హాజరుకావడంతో నామమాత్రంగా అర్ధగంటలో సమావేశాన్ని ముగించి జడ్పీ చైర్‌పర్సన్ వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ సమావేశాలకు హాజరుకావాలని బీఆర్ఎస్ జడ్పీటీసీలకు స్వయంగా జడ్పీ చైర్‌పర్సన్ ఫోన్ చేసినా ఎవరూ స్పందించకపోవడంతో తూతూ మంత్రంగా రెండు కమిటీ సమావేశాలను నిర్వహించారు. జడ్పీ స్టాండింగ్ సమావేశాలకు సంబంధించి వ్యవసాయంతోపాటు గ్రామీణాభివృద్ధి, ఆర్థిక–ప్రణాళిక, వైద్యారోగ్యం–విద్య, సాంఘిక సంక్షేమం, మహిళా సంక్షేమం, పనులకు సంబంధించిన ఏడు స్టాండింగ్ కమిటీలు ఉంటాయి. సోమవారం నిర్వహించిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలకు జడ్పీ చైర్‌పర్సన్(కోట్‌పల్లి జడ్పీటీసీ)తోపాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన పెద్దేముల్, బంట్వారం జడ్పీటీసీలు, అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరిన బషీరాబాద్ జడ్పీటీసీ సమావేశానికి హాజరయ్యారు.

మిగతా 14 మంది బీఆర్ఎస్ జడ్పీటీసీలు ఆ పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు దూరంగా ఉన్నారు. ప్రతి స్టాండింగ్ కమిటీలోనూ ఇద్దరు సభ్యుల కోరం ఉంటేనే సమావేశం నిర్వహించేందుకు వీలుంటుంది. కేవలం నలుగురు సభ్యులు మాత్రమే ఉండడంతో పనుల కమిటీతోపాటు సాంఘిక సంక్షేమ కమిటీలకు సంబంధించిన సమావేశాలను నిర్వహించి ముగించారు.



జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి హాజరైన కేవలం ముగ్గురు కాంగ్రెస్ జడ్పీటీసీలు

# ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు నిర్వహణ
- మొదటి ఏడాదికి 74,875, ద్వితీయ ఏడాదికి 74,191 మంది హాజరుకానున్న విద్యార్థులు
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి నో ఎంట్రీ

రంగారెడ్డి, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఈనెల 28 నుంచి వచ్చే నెల 19 వరకు ఇంటర్ పరీక్షలు జరుగనున్నాయి. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారయంత్రాంగం పూర్తి చేసింది. ఈనెల 28న షురూ కానున్న మొదటి ఏడాది పరీక్షలకు 74,875 మంది, 29 నుంచి నిర్వహించనున్న ద్వితీయ ఏడాది పరీక్షలకు 74,191 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగనున్న పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 195 కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఉదయం 8.45 నిమిషాల లోపే పరీక్షా కేంద్రాల్లోకి చేరుకోవాల్సి ఉంటుంది.

**పకడ్బందీ చర్యలు..**

పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షల నిర్వహణకు సెంటర్ ఇన్‌చార్జిలు, డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించారు. అలాగే..ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు కూడా సిద్ధంగా ఉండనున్నాయి. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగనున్నాయి. 31 పోలీస్‌స్టేషన్లలో ప్రశ్నాపత్రాలను భద్రపర్చనున్నారు. నిమిషం నిబంధన అమలులో ఉన్నందున విద్యార్థులు త్వరగా పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులను ఉదయం నుంచే నడిపేలా ఆర్టీసీ చర్యలు తీసుకుంటున్నది.

**కేంద్రాల్లో మౌలిక వసతులు..**

విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రథమ చికిత్స అందించేందుకు ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఏఎన్ఎంలు అందుబాటులో ఉండనున్నారు. నిరంతర విద్యుత్తును అందించనున్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండనున్నది. పరీక్షా సమయంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయనున్నారు. విద్యార్థులు తమ వెంట సెల్‌ఫోన్లను తీసుకురావొద్దని.. ఒకవేళ తీసుకొస్తే మొబైల్ పాయింట్ కేంద్రాల్లో ఉంచాలని డీఐఈవో శ్రీదేవి సూచించారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

